క్లుప్తంగా

కొప్పరపాలెంలో నేడు జేఏఎస్ క్యాంపు

బల్లికురవ: జగనన్న ఆరోగ్య సురక్ష, రెండో విడత క్యాంపు బుధవారం మండలంలోని కొప్పరపాలెం గ్రామంలో నిర్వహిస్తున్నట్లు గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ రమీజ్ అహమ్మద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి విడతలో చూయించుకున్న రోగులు కేస్‌షీట్లు, రిపోర్టులతో పాటు కొత్త రోగులు శిబిరాన్ని సద్వినియోగపరుచుకోవాలని వైద్యాధికారి కోరారు. పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆది, సోమ, మంగళవారాల్లో మండలంలోని 44 పోలియో బూత్‌లు, మొబైల్ టీమ్ ద్వారా ఇంటింటికి తిరిగి 5889 నూరుశాతం లక్ష్యం పూర్తిచేసినట్లు వివరించారు.

భూమి ఆక్రమణపై కేసు


ఎఫ్ఐఆర్ కాపీని చూపిస్తున్న బాధితురాలు, దళిత నాయకులు

అద్దంకి రూరల్: భూమి ఆక్రమణపై పోలీసులు కేసు నమోదు చేశారు. అగ్ర కులస్తులు తన భూమి కబ్జా చేశారని దళిత మహిళ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి 14 రోజులైన పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతో మహిళ ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్‌ను ఆశ్రయించటంతో మంగళవారం సీఐ కృష్ణయ్య కేసు నమోదు చేశారు. మాల మహానాడు అధ్యక్షుడు దారా అంజయ్య, బాధితురాలు విమలమ్మ కుటుంబ సభ్యులు స్టేషన్‌కు వెళ్లి ఎఫ్ఐఆర్ కాపీని తీసుకున్నారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ పోలీసులు అగ్రకులాల వారికి కొమ్ముకాస్తున్నారని వారు విమర్శించారు. కార్యక్రమంలో దళిత నాయకులు కాకుమాను రవి, రంజిత్, యర్రమోతు నారాయణ, యరమాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు వినియోగించుకోవచ్చు


మాట్లాడుతున్న సీఐ, ఎస్సై

బల్లికురవ: ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సంతమాగులూరు సీఐ నరసింహారావు కోరారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద వివిధ పనులపై వచ్చిన ప్రజలతో ఆయన మాట్లాడారు. త్వరలో జరిగే ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేందుకు పోలీసు శాఖకు సహకరించాలన్నారు. ఎన్నికల్లో అల్లర్లు, అలజడులు, సృష్టిస్తే ఎంతటి వారిపైనైనా రౌడీషీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లోని ప్రజలంతా ఐక్యతతో ఒకరికొకరు సోదరభావంతో మెలగాలన్నారు. గ్రామదర్శిని కార్యక్రమంలో బల్లికురవ ఎస్సై పీ. నాగశివారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

100 శాతం పల్స్‌పోలియో పూర్తి


చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న వైద్యాధికారి కీర్తిసరోజ్

ఇంకొల్లు (చినగంజాం): ఇంకొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో పల్స్ పోలియో కార్యక్రమం ఈ నెల 3,4,5 తేదీల్లో నిర్వహించి100 శాతం పూర్తి చేసినట్లు వైద్యాధికారి టీ అజలి తెలియజేశారు. మండలంలో మొత్తం 17 పల్స్ పోలియో బూత్‌లలో 3537 మంది 0–5 ఏళ్ల లోపు చిన్నారులు లక్ష్యంగా కార్యక్రమాన్ని పూర్తి చేసినట్లు తెలిపారు. 3వ తేదీ 3296 మంది, 4వ తేదీ 163 మంది, 5వతేదీ 97 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు. ఇంకొల్లులో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు సహకరించిన ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్‌లు, ఆశాలు, వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్వచ్ఛంద కార్యకర్తలు, గ్రామ పెద్దలు వైద్యాధికారి ధన్యవాదాలు తెలియజేశారు. చినగంజాం మండల పరిధిలోని చినగంజాం, సంతరావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 100 శాతం పల్స్‌పోలియో కార్యక్రమాన్ని పూర్తి చేసినట్లు వైద్యాధికారులు ఎస్ విజయ భాస్కర్, కే కీర్తిసరోజ్ తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి పీ సాయిశ్రీ చరణ్ సంతరావూరు పీహెచ్‌సీ పరిధిలో మూడురోజుల పల్స్ పోలియో కార్యక్రమంలో 97 శాతం చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారి కే కీర్తి సరోజ్ తెలిపారు. పిల్లల ఆరోగ్యంపై కూడా శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి బీ నాగేంద్రం, సూపర్‌వైజర్‌లు యూ వెంకటరమణ, వరదానం,మాధవి, సిబ్బంది విజయప్రసన్న, శ్రీలక్ష్మి, సుధా, స్టాఫ్ నర్స్‌లు,ఏఎన్ఎంలు,ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాలు పాల్గొన్నారు.

పేదలను ఆదుకున్న ఏకైక ప్రభుత్వం


చినగంజాంలో పాదయాత్ర ర్యాలీలో పాల్గొన్న సమన్వయకర్త యడం బాలాజీ


చినగంజాంలో బహిరంగ సభలో మాట్లాడుతున్న యడం బాలాజీ

- పేదవాడి కడుపు నిండాలంటే సీఎం జగన్ రాష్ట్రానికి అవసరం
- నియోజకవర్గ సమన్వయకర్త యడం బాలాజీ
- భారీగా పాదయాత్ర, ర్యాలీ

చినగంజాం: పేదవాడి కడుపు నిండాలంటే సీఎం జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రానికి అవసరమని పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త యడం బాలాజీ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మండల కేంద్రం చినగంజాం సోపిరాల రైల్వేగేటు సెంటర్ నుంచి పాదయాత్రగా ప్రధాన వీధులలో ర్యాలీ నిర్వహించారు. దారి పొడవునా ఆయనకు ప్రజలు పూలతో స్వాగతం పలికారు. ర్యాలీ శివాలయం వీధి, సినిమాహాలు సెంటర్, స్టేషన్‌రోడ్, మెయిన్ రోడ్ గుండా అంబేడ్కర్ నగర్ వరకు సాగింది. మార్కెట్ సెంటర్ వద్దనున్న అంబేడ్కర్, వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభకు అల్లడి శ్యాంబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సమన్వయకర్త బాలాజీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పేద, బడుగు, బలహీన వర్గాలను ఆదుకున్నారన్నారు. ప్రభుత్వం వృద్ధులకు, వితంతువులకు, దివ్యాంగులకు ఇచ్చే పింఛను కోసం వారు ఇబ్బందులు పడకుండా నేరుగా వలంటీర్‌ల ద్వారా ఇంటికి తీసుకొనివచ్చి అందించి ఆదుకున్నారని పేర్కొన్నారు. తండ్రికి తగ్గ తనయుడుగా సీఎం జగన్ రాష్ట్రంలో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేసి తాను గొప్ప మనసున్న మనిషిగా నిరూపించుకున్నారని అన్నారు.

పర్చూరులో వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం ఖాయం..

రాబోయే ఎన్నికల్లో పర్చూరులో పర్చూరులో వైఎస్సార్ సీపీ జెండ ఎగరడం ఖాయమన్నారు. సంక్షేమ పథకాలను తిరిగి పొందాలంటే ఆయనను తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం మనందరిపైన ఉందని ఆయన అన్నారు. పేదల పాలిట గొప్ప వరాలను ప్రసాదిస్తున్న ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అని పేదవాడు రెండుపూటలా కడుపు నిండాలంటే పేదవాడి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావాలని అన్నారు. పేదవాడి మోములో నవ్వు ఉండాలంటే మరోసారి సీఎం జగన్‌ను గెలిపించుకోవాలన్నారు. రాబోయే వారం రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ రానున్నదని నామినేషన్ వేసిన అనంతరం మరోసారి చినగంజాంలో మరో భారీ సభను ఏర్పాటు చేస్తానని అన్నారు. సమన్వయకర్త బాలాజీని మహిళలు, అంబేడ్కర్ యూత్, మహిళా టైలర్‌లు, అంబేడ్కర్ నగర్, భాగ్యనగర్ వాసులు, పలువురు అభిమానులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఇరువురు వృద్ధ మహిళలకు ఆయన దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆసోది బ్రహ్మానందరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు మహ్మద్‌షా, తొట్టింపూడి తిరుపతిరావు మేడికొండ బాబురావు, బ్రహ్మానాయుడు, ఎద్దు మాల్యాద్రి, మార్పు ఎలీషా, కొల్లా వెంకటరావు, నల్లమోపు జయసింహారెడ్డి, గుడిసె చిన్న, గేరా రవీంద్రనాథ్ టాగూర్,వైఎస్సార్‌సీపీ క్రిష్టియన్ మిషనరీ ప్రధాన కార్యదర్శి టీ డేవిడ్ మనోహర్, కందుల విజయబాబు, , మేడికొండ అంబేద్కర్ యూత్ తదితరులు పాల్గొన్నారు.


చినగంజాంలో బహిరంగ సభకు హాజరైన ప్రజానీకం

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు


మాట్లాడుతున్న ఆర్వో సూర్యనారాయణరెడ్డి

చీరాల టౌన్: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాం.. ఓటరు జాబితాలో అభ్యంతరాలుంటే రాజకీయ పార్టీల నేతలు నేరుగా తగిన ఆధారాలతో సంప్రదించవచ్చని చీరాల నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్డీవో జి.సూర్యనారాయణరెడ్డి సూచించారు. మంగళవారం చీరాల తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్, అదనపు ఎన్నికల అధికారి కె.నాసరయ్య ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో చీరాల ఆర్వో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా నియోజకవర్గ ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఈ-రోల్‌లో వచ్చిన అర్జీల విచారణను త్వరగా చేయాలన్నారు. బిచ్చగాళ్లు, అనాథాశ్రమాల్లో ఉండే వారికి ఓటు హక్కు ఎక్కడ ఉంటే వారికి అనుకూలమైన ప్రాంతంలో ఓటు హక్కు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. ఎన్నికల్లో వినియోగించే వీవీప్యాడ్స్, ఈవీఎంలు భద్ర పరిచేందుకు సెయింటాన్స్ ఇంజినీరింగ్ కళాశాలను ఎంపిక చేశామని తెలిపారు. అలానే ఎన్నికల్లో ఓట్లు లెక్కింపునకు బాపట్ల జిల్లా కేంద్రంలో బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలను జిల్లా ఎన్నికల అధికారి కౌంటింగ్ కేంద్రంగా ఎంపికచేశారని రాజకీయ పార్టీల నాయకులకు ఆర్వో వివరించారు. ఈసమావేశంలో డీటీలు సురేష్, ఆదినారాయణ, రీసర్వే డీటీ అర్జున్, బీజేపీ, టీడీపీ, సీపీఎం, కాంగ్రెస్, జనసేన, బీఎస్పీ పార్టీల నాయకులు ఉన్నారు. మండలంలోని ఈపురుపాలెం, తోటవారిపాలెం, పిట్టువారిపాలెం తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఏఈఆర్వో పరిశీలించారు.ఏఈఆర్వోతో పాటు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శేఖర్, వీఆర్వో శ్రీను, సిబ్బంది ఉన్నారు.

బాలాజీని కలిసిన గ్రామస్తులు


సమన్వయకర్త బాలాజీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న గ్రామస్తులు

చినగంజాం: మండలంలోని మున్నంవారిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం నియోజకవర్గ సమన్వయకర్త యడం బాలాజీని కలిశారు. మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో ఆయనను కలిసిన వారు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు ఆయనతో మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో తమ గ్రామం నుంచి నూరుశాతం మద్దతుతో గెలిపించుకుంటామని, గ్రామంలోని నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, ప్రజలందరూ ఐకమత్యంగా ఉండి పార్టీ గెలుపునకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కన్వీనర్ నల్లమోపు జయసింహరెడ్డి, గ్రామ ఉప సర్పంచ్ బేతాళ మునిరత్నం, గ్రామ కాపులు మున్నం శంకర్‌రెడ్డి, ఆసోది గోపిరెడ్డి, కొప్పోలు యలమంద, భాస్కరరెడ్డి, నారపరెడ్డి, బాలిరెడ్డి తదితరులు ఆయనను కలిసిన వారిలో ఉన్నారు.

విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

పర్చూరు (చినగంజాం): పదవతరగతి పరీక్షలలో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలని రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు అధ్యక్షుడు నాగబైరు శ్రీనివాసరావు అన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. పర్చూరు మండలం నాగులపాలెం గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, యద్దనపూడి మండలం పోలూరు గ్రామంలోని పరుచూరి శేషాచార్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రోటరీ సభ్యులు నర్రా వెంకటేశ్వరరావు, లక్ష్మీ సుధల ఆర్థిక సాయంతో 120 మందికి పరీక్ష ప్యాడ్‌లు, పరీక్ష సామగ్రి క్లబ్ అధ్యక్షుడు నాగబైరు శ్రీనివాసరావు అందజేశారు. దాత వెంకటేశ్వరరావు విద్యార్థులు పరీక్షలలో బాగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పీ విశ్వరాణి, క్లబ్ కార్యదర్శి పంబి సదానందరెడ్డి పాల్గొన్నారు.

బాలికల్లో చైతన్యం అవసరం

పర్చూరు (చినగంజాం): ప్రస్తుత సమాజంలో మారుతున్న పరిస్థితులు దృష్ట్యా బాలికలు చైతన్యవంతులు కావాలని పర్చూరు అంగన్‌వాడీ సీడీపీవో సుభద్ర అన్నారు. మంగళవారం మార్చి8 న జరిగే మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఎస్‌కేపీఆర్ డిగ్రీ కళాశాలలో బాలికల హక్కుల గురించి వారికి అవగాహన కల్పించారు. మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు , న్యాయపరమైన సలహాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం కళాశాలలో మానవహారం ఏర్పాటు చేసి నినాదాలు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ దీపాదేవి పాల్గొన్నారు.

23 నుంచి అద్దంకి వార్షిక తిరునాళ్లు

- 23 నుంచి 25వ తేదీ వరకు తిరునాళ్లు
- చీరాల ఆర్డీవో సత్యనారాయణరెడ్డి


తిరునాళ్ల పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

అద్దంకి: జిల్లాలో ప్రసిద్ధి చెందిన శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి వార్షిక తిరునాళ్లు విజయవంతం చేయాలని చీరాల ఆర్డీవో సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. దేవస్థాన అసిస్టెంట్ కమిషనర్ సుభద్ర అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో మంగళవారం సమన్వయ కమిటీ సమావేశాన్ని స్థానిక టీడీపీ కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 23 నుంచి 25వరకు వరకు మూడు రోజుల పాటు ప్రసన్నాంజనేయ స్వామి 69వ వార్షిక తిరుణాళ్లను నిర్వహించనున్నామని చెప్పారు. తిరునాళ్ల విజయవంతానికి దేవదాయ శాఖతోపాటు, రెవెన్యూ, ఆర్డబ్ల్యూఎస్, పోలీస్, మెడికల్, ఆర్టీసీ తదితర శాఖల పాత్ర కీలకమైనది చెప్పారు. దూరప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులకు బస్సు సౌకర్యం, పోలీసు బందోబస్తు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. తిరునాళ్ల నిర్వహించే సమయానికి సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉండే అవకాశం ఉన్నందున రాజకీయ నాయకులకు సంబంధించిన కార్యకలాపాలు, ఫ్లెక్సీలు, జెండాలు ఏర్పాటు చేయడానికి వీలులేదని చెప్పారు. ఆ సమయంలో పూర్తిగా ఆర్వో ఆధీనంలోకి వెళ్తుందన్నారు. మహిళలకు స్నానాల గదులు, భక్తులకు మంచినీళ్లు, ఉచిత ప్రసాదం, ప్రత్యేక అవసరాల వారికి వీల్ చైర్లు ప్రత్యేక క్యూలైన్లలో దర్శనం, వీఐపీలకు ప్రత్యేక దర్శన సమయం కోసం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఉచిత దర్శనంతోపాటు రూ.50, రూ.100 ప్రత్యేక దర్శన క్యూలైన్లు ఉంటాయన్నారు. బందోబస్తు, రాష్ట్రీయ రహదారిపై భారీ వాహనాల దారి మళ్లింపు, అవాంఛనీయ ఘటనలు జరుగకుండా నిఘా పెడతామని చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్ చెప్పారు. అనంతరం తిరునాళ్ల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ ఎస్‌కే మహబూబ్ సుభానీ, ఎంపీడీవో సత్యనారాయణ, సీఐ కృష్ణయ్య, ఆర్టీసీ డీఎం రామమోహనరావు, ఇరిగేషన్ ఏఈ మధు, అబ్కారీ, ఫైర్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో ప్రపంచ జ్ఞానం


కార్యక్రమంలో మాట్లాడుతున్న హెచ్ఎం

చీరాల అర్బన్: వేసవి సెలవుల్లో క్రమం తప్పకుండా పుస్తక పఠనం చేయడం వలన ప్రపంచ జ్ఞానాన్ని పెంచుకోవచ్చని పేరాల ఏఆర్ఎం హైస్కూల్ హెచ్ఎం బి.సాల్మన్‌రాజు అన్నారు. ప్రకాశం గ్లోబల్ ఎన్నారై ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పేరాలలోని ఆంధ్రరత్న మున్సిపల్ హైస్కూల్‌కు రూ.30 వేలు విలువ చేసే పుస్తకాలను అందించారు. కార్యక్రమానికి ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు కొర్రపాటి సుధాకర్ పాల్గొన్నారు. టెక్నాలజీ పెరిగిపోతున్న ఈ సమయంలో పుస్తకాలు చదవడం ఒక వ్యసనంలా మార్చుకోవాలన్నారు. విదేశాల్లో స్థిరపడిన భారతీయుల సహకారంతో అనేక పాఠశాలలో పుస్తకాలు పంపిణీ చేయడంతో పాటు మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ కో–ఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి, స్టాఫ్ సెక్రటరీ వై.గాంధి, కె.రాజేంద్రప్రసాద్, ఎం.కృష్ణమోహన్, టి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గడ్డివాము, పశువుల కొష్టం దగ్ధం

- రూ.2 లక్షల ఆస్తి నష్టం


దగ్ధమవుతున్న కొష్టం

నందిగుంటపాలెం (కారంచేడు): అకస్మాత్తుగా గడ్డివాము, పశువుల కొష్టం దగ్ధమైంది. ఈఘటన మండలంలోని రంగప్పనాయుడువారిపాలెం గ్రామశివారు నందిగుంటపాలెంలో మంగళవారం అగ్ని ప్రమాదం జరిగింది. స్థానికులు, బాధితుల వివరాల మేరకు మమధ్యాహ్నా సమయంలో గ్రామానికి చెందిన జే దానియేలుకు చెందిన గడ్డివామి, పశువుల కొష్టంలకు ఒక్కసారిగా వరిగడ్డి వాము నుంచి నిప్పురవ్వలతో కూడిన మంటల వ్యాపించాయి. దానికి పక్కనే ఉన్న పశువుల కొష్టానికి అంటుకున్నాయి. గడ్డివాముతో పాటు, పశువుల కొష్టానికి మంటలు వ్యాపించడంతో అవి పూర్తిగా కాలి బూడిదయ్యాయి. అప్పటికే అక్కడ ఉన్న ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు చీరాల ఫైరింజన్‌కు సమాచారం అందించాడు. వాళ్లు వచ్చే లోపు గ్రామస్తులు మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. ఫైర్ సిబ్బంది వచ్చిన తరువాత మంటలను పూర్తిగా అదుపులోకి వచ్చాయి. ఈ అగ్ని ప్రమాదంలో సుమారు రూ.2లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు తెలిపారు. సంఘటన స్థలాన్ని గ్రామ సర్పంచ్ కొర్రపాటి అనీల్, వీఆర్ఓ రాంబాబు, కార్యదర్శి డేవిడ్, సచివాలయ సిబ్బంది సందర్శించి అంచనాలు సిద్ధం చేశారు.

మహా శివరాత్రికి ఏర్పాట్లు పూర్తి


పంచాయతీలో ఏర్పాట్లను ప్రారంభిస్తున్న సర్పంచ్ బ్రహ్మానందరెడ్డి

చినగంజాం: శివరాత్రి పండుగ పురస్కరించుకొని కొత్తపాలెం పంచాయతీలో భక్తులకు సౌకర్యవంతంగా ఉండేందుకు అవసరమైన పనులను మంగళవారం గ్రామ సర్పంచ్ ఆసోది బ్రహ్మానందరెడ్డి ప్రారంభించారు. కొత్తపాలెం పంచాయతీ పరిధిలోని బాలకోటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 8వ తేదీ శివరాత్రి ఉత్సవాలు జరగనున్న దృష్ట్యా భారీ సంఖ్యలో భక్తులు హాజరవుతున్న నేపథ్యంలో వారికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు పంచాయతీ పరిధిలోని అన్ని ఏర్పాట్లను నిర్వహిస్తున్నారు. రోడ్డుకిరువైపులా గుబురుగా పెరిగిన చిల్లచెట్లు తొలగింపు, డ్రైనేజీలు శుభ్రపరచడం , వాహనాలకు ఇబ్బది లేకుండా ఆక్రమణలు తొలగింపు, ఆలయం వద్ద పంచాయతీ కార్మికులతో శుభ్రం చేయించడం, బ్లీచింగ్ చల్లేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈపనులను సర్పంచ్ సమక్షంలో పంచాయతీ సిబ్బంది రమేష్ స్వయంగా దగ్గర ఉండి నిర్వహిస్తున్నారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత

చీరాల రూరల్: ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా క్రీడలు, వ్యాయామాలతో మమేకమవ్వాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్పోర్ట్స్ అండ్ కల్చరల్, బార్ వైస్ ప్రెసిడెంట్ పీవీ విజయలక్ష్మి ఆధ్వర్యంలో మహిళా న్యాయవాదులకు చెస్, క్యారమ్స్‌పై పోటీలు నిర్వహించారు. పోటీలను న్యాయమూర్తులు సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ రెహానాలు ప్రారంభించారు. న్యాయమూర్తులు మహిళా న్యాయవాదులతో ఎంతో సంతోషంగా గడిపారు. వారితో కలసి ఆటలు ఆడుతూ ఎంతో ఉల్లాసంగా మహిళా న్యాయవాదులను ఉత్సాహపరిచారు. అనంతరం కోర్టు ప్రాంగణంలో షటిల్ కోర్టులను ప్రారంభించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరవ రమేష్‌బాబు, వైస్ ప్రెసిడెంట్ విజయలక్ష్మి, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ రవికుమార్, ట్రెజరర్ రాము, మణి నాగశయన, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

జిల్లాలు దాటిన వలంటీర్ల సేవ


తిరుపతిలో వరలక్ష్మీకి పింఛన్ అందిస్తున్న వలంటీర్ అనూష


హైదరాబాద్‌లో పింఛన్ సొమ్ము అందజేస్తున్న వలంటీర్ దేవేంద్ర


ఒంగోలులో పింఛన్ అందజేస్తున్న వలంటీర్

చీరాల టౌన్: సమాజసేవే లక్ష్యంగా పనిచేస్తున్న వలంటీర్ల సేవలు మరువలేనివని పింఛన్ లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అనారోగ్యంతో బాధపడుతూ తిరుపతిలోని బంధువుల ఇంట్లో ఆశ్రయం పొందుతున్న బాధితురాలికి చీరాల నుంచి వెళ్లి పింఛన్ అందించింది ఓ వలంటీర్. వలంటీర్ల వ్యవస్థపై దిక్కుమాలిన విమర్శలు చేస్తున్న టీడీపీ, జనసేన పార్టీలకు చెంపపెట్టుగా మారుతున్నాయి వారి సేవలు. వివరాల్లోకి వెళ్తే చీరాల మున్సిపాలిటీలోని 31 వార్డులోని 23 సచివాలయంలో వలంటీర్‌గా పనిచేస్తున్న వనమా అనూష లబ్ధిదారురాలు తన్నీరు వరలక్ష్మీ మార్చి పింఛన్ తీసుకోలేదు. కిడ్నీ సమస్యతో బాధపడుతూ తిరుపతిలోని వైద్యశాలలో చికిత్స పొందుతూ బంధువుల ఇంట్లో ఆశ్రయం పొందుతోంది. ఈవిషయం తెలుసుకున్న వలంటీర్ మంగళవారం రాత్రికి తిరుపతి వెళ్లి వరలక్ష్మీ ఇంటికి వెళ్లి పింఛన్ అందించి తన కర్తవ్యాన్ని సమర్థవంతంగా నిర్వహించింది.

హైదరాబాద్ వెళ్లి పింఛన్ అందజేత..

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల సచివాలయం–1 పరిధిలోగల శ్రీధారా లలితమ్మ అనారోగ్యం కారణంగా హైదరాబాద్‌లో చికిత్స పొందుతోంది. కాగా వలంటీర్ నీలం దేవేంద్ర హైదరాబాద్ వెళ్లి లలితమ్మకు పింఛన్ సొమ్ము అందజేశాడు. పింఛను అందుకున్న లలితమ్మ తాను ఇంతదూరంలో ఉన్నా అందజేయడం ఎంతో ఆనందంగా ఉందని.. రానున్న ఎన్నికల్లో తాను వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే ఓటు వేస్తానని ఆనందంగా తెలిపినట్లు వలంటీర్ పేర్కొన్నారు. సీఎం జగన్ ఆశయ సాధనకు కృషి చేస్తున్న వలంటీర్ల సేవలను లబ్ధిదారురాలితో పాటుగా పలువురు ప్రశంసించారు.

ఒంగోలుకు వెళ్లి..

బల్లికురవ: ఒంగోలు వైద్యశాలకు వెళ్లి లబ్ధిదారుడికి బల్లికురవ వలంటీర్ మంగళవారం పింఛన్ అందజేశారు. వివరాలు మండల కేంద్రమైన బల్లికురవకు చెందిన తాళ్లూరి హనుమంతరావు వృద్ధాప్య పింఛన్ పొందుతున్నాడు.

గత కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఈనేపథ్యంలో వలంటీర్ కత్తి అనూష మంగళవారం వైద్యశాలకు వెళ్లి పింఛన్ నగదు అందజేశారు.

వాలీబాల్‌లో సెయింటాన్స్ క్రీడాకారుల ప్రతిభ


విజేత క్రీడాకారులతో కళాశాల యాజమాన్యం

వేటపాలెం: జాతీయ స్థాయిలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థులు ప్రతిభ కనబరిచి విన్నర్స్‌గా నిలిచారని కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్ లక్ష్మణరావు మంగళవారం తెలిపారు. ఇటీవల అమరావతి లోని ఎస్ఆర్ యూనివర్శిటి వారి ఉద్గమ్–2024 సందర్భంగా జాతీయ వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఆంధ్రా, తెలంగాణా రాష్ట్రాల నుంచి 28 జట్లు పాల్గొన్నాయని తెలిపారు. ఫైనల్ పోటీల్లో సత్య భామ యూనివర్శిటీ, తిరుపతి జట్లను ఓడించి సెయింట్ ఆన్స్ జట్టు విన్నర్స్‌గా నిలిచారని వ్యాయామ ఉపాధ్యాయుడు అన్నం శ్రీనివాసరావు తెలిపారు. విన్నర్స్‌గా నిలిచిన జట్టుకి రూ.16 వేల బహుమతి, పతకాల, సర్టిఫికెట్లు అందజేసినట్లు తెలిపారు. క్రీడాకారులను ప్రిన్సిపాల్ ఎం వేణుగోపాలరావు, మేనేజర్ ఆర్‌వీ రమణమూర్తి, అధ్యాపకులు అభినందించారు.

పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికాకూడదు


మాట్లాడుతున్న ఎంఈవో–2 సుధాకరరావు

అద్దంకి రూరల్: విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికాకూడదని ఎంఈవో–2 బూదాటి సుధాకరరావు అన్నారు. మంగళవారం మండలంలోని చక్రాయపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో వార్షిక వేడుకలు నిర్వహించారు. దీనిలో భాగంగా 9వ తరగతి విద్యార్థులు 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలికారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు ఎలా సిద్ధం కావాలో వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కేవీ శ్రీనివాసరావు, పీసీ చైర్మన్ గోగులమూడి పార్వతి, యు. శ్రీనివాసులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.